

ఆ సార్ గ్యాంగ్‌దే హవా

● గవర్నమెంటు మారినా.. ఆ బ్యాచ్‌దే పెత్తనం

● అడ్డగోలుగా డబ్బు వసూళ్లు

● కలవరపడుతున్న పోలీసులు

(కడప - ఆంధ్రజ్యోతి): ఔను.. ఆ సార్ అంటే నిన్నటిదాకా కొందరు టీడీపీ నేతలకు వణుకు. ఆసార్ పేరులో అ అనే అక్షరం ఉంది. అంటే అశోకచక్రం లాంటి క్యాండెట్ ఆయన. అలాంటి ఆయన మాత్రం ప్రభుత్వ సొమ్ముతో జీతాలు తీసుకుంటాడు. ధన మాన ప్రాణాలను కాపాడాల్సిన కీలక శాఖలో ఆ సారు ఉన్నారు. అయితే ఆ సారుకు ఆ డ్యూటీ అనేది ముఖ్యం కాదు. అప్పటి వైసీపీ నేతలను సంతృప్తిపరచడమే ఆ సార్ హాబీ అంటారు. ఆయనకు తెలిసింది ఒకటే వైసీపీ నేతలకు ఊడిగం చేయడమే. అందుకే ఆయన వివాదాస్పదంగా మారారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిని కాపు కాచి అరెస్టు చేసిన తీరు ఉమ్మడి రాష్ట్రంలోనే కలకలం రేపింది. ఓ విధంగా చెప్పాలంటే ఆయన వైసీపీ పాలనలో డీఫాల్ట్ ఎస్పీగా ముద్ర పడ్డారు. అయితే ఆయన వ్యవహారశైలి పెద్ద వివాదాస్పదంగా మారింది. అయితే కరెక్టుగా ఆ సారు ఎన్నికలకు ముందు విధుల్లో లేకుండా చెక్కేశారంటారు. అయితే ఇప్పటికీ కూడా సారు బ్యాచ్ డ్యూటీలో లేకున్నప్పటికీ ఆమ్యామ్యాల కోసం పోటీ పడుతుండడం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

పోలీసుబ్యాచ్‌లో ఇప్పుడు ఆ సారు గురించే చర్చ నడుస్తోంది. ఆయన ఎన్నికలకు ముందే జారుకున్నారు. ఆ సారు బ్యాచ్ జగన్ అండ్ కోకు జేబు బ్యాచ్ అనే పేరుంది. మళ్లీ జగన్ సీఎం అవుతారన్న ఉద్దేశ్యంతో ఆ సార్ అండ్ కో తన బ్యాచ్‌ను కీలకమైన దోపిడీల్లో పెట్టారంటారు. అయితే ఆ సార్ పేరు చెప్పి కౌంటింగ్ తరువాత కూడా ఆ గ్యాంగ్ రెచ్చిపోయిందంటారు. కడపకు చెందిన ఓ వైసీపీ కార్పొరేటరు చెన్నై నుంచి కడప వచ్చారంటారు. అయితే ఆయన వద్ద పత్రాలు లేని సుమారు రూ.3 కోట్లకు పైగా విలువ చేసే బంగారం తనిఖీల్లో పట్టుబడిందని చెబుతారు. అయితే కడప సబ్ డివిజన్‌లో ఎస్ఐగా పనిచేసిన ఓ అధికారి ఆ ఇష్యూను డీల్ చేసి కేసు లేకుండా చేసుకున్నారంటారు. ఈ ఘటనలో పెద్దఎత్తున నిధులు చేతులు మారాయంటారు. అయితే ఆయన వైసీపీ కార్పొరేటరు. కరడుగట్టిన వైసీపీవాది. ఇంకా ఎన్నికల ఫలితాలు రాలేదు. అతని దగ్గర ఒరిజినల్ డాక్యుమెంటేషన్లు లేవు. చివరికి ఆ సారు బ్యాచ్ చెరీ సగం తీసుకున్నట్లు పోలీసువర్గాల్లో టాక్ నడుస్తోంది. ఇక ఈ సారి ఎన్నికల సమయంలోనే ఐపీఎల్ మ్యాచ్ జరిగాయి. అందుకు తగ్గట్లుగానే కడప జిల్లా ఎన్నికల ఫలితాలు రంజుగా మారాయి. అయితే ఆ సారు బ్యాచ్ దేవుని కడపకు చెందిన ఓ బుకీ నుంచి రూ.8లక్షలు తీసుకున్నట్లు చెబుతారు. ఇక రశీదులు లేవనే పేరుతో ప్రొద్దుటూరు చెందిన ఓ వ్యాపారి నుంచి రూ.8 లక్షలు తీసుకున్నట్లు పెద్ద టాకే నడుస్తోంది. సార్ శకం ముగిసి చంద్రబాబు సీఎం అయినప్పటికీ ఇప్పటికీ ఆ సారు బ్యాచ్ కడపలో హల్‌చల్ చేయడం హాట్‌టాపిక్‌గా మారింది.

మాతృమరణాలు నివారించాలి : డీఎంహెచ్‌వో

కడప(కలెక్టరేట్), జూన్ 22: మాతృ మరణాలు జరగకుండా వైద్యులు అంకితభావంతో సేవలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు వైద్యులను ఆదేశించారు. శనివారం ఖాజీపేట ప్రాథమిక ఆసుపత్రుల పరిధిలో మాతృ మరణాలపై డీఎంఅండ్‌హెచ్‌ఓ సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాతృ మరణాలకు గల కారణాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి రెగ్యులర్‌గా వారికి అందించే వైద్యసేవలపై ఫాలోఅప్ చేయాన్నారు. అలాగే జనన మరణాల నివారణకు యాక్షన్‌ప్లాన్ తెలియజేయాలన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి మాట్లాడుతూ నాలుగైదు ప్రసవాలు అయితే మాతృ మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. కాబట్టి రెండోకాన్పు తరువాత గర్భిణులకు పిల్లలు పుట్టకుండా ఉండేలా తాత్కాలిక, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ ఉమమహేశ్వరకుమార్, డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, డాక్టర్లు అరుణకుమారి, సురేంద్రకుమార్, 108 జిల్లా కో-ఆర్డినేటర్‌తో పాటు దువ్వూరు, ఖాజీపేట పీహెచ్‌సీల వైద్యులు, ప్రైవేట్ ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సీఎం కాన్వాయ్‌లో స్వల్ప ఘటన

● అగ్నిమాపక శాఖ వాహనాన్ని ఢీకొన్న ఇన్నోవా

సీకేదిన్నె, జూన్ 22: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్‌లోని అగ్నిమాపక వాహనాన్ని ఇన్నోవా కారు ఢీకొన్న సంఘటన చింతకొమ్మదిన్నె మండల పరిధిలో జరిగింది. సీఐ శివశంకర్‌నాయక్ వివరాల మేరకు.. ఎయిర్‌పోర్టు నుంచి మాజీ సీఎం వైఎస్ జగన్ వెళుతున్న కాన్వాయ్ రామరాజుపల్లె వద్దకు రాగానే కడప నుంచి పులివెందులకు వెళుతున్న ఇన్నోవా వాహనం డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యం కారణంగా అగ్నిమాపక వాహనాన్ని ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో ఇన్నోవా వాహనం స్వల్పంగా దెబ్బతిందని, ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదన్నారు. మాజీ సీఎం కాన్వాయ్‌కి, ఇన్నోవాకు ఎటువంటి సంబంధం లేదని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమాలకు సహకారం

● వాస్తవాలు తెరమరుగు ● విచారణ మమ.. అనిపించారు ● వైసీపీ పాలకవర్గాన్ని కాపాడే యత్నం ● డీసీఎంఎస్‌పై చర్యలు ప్రశ్నార్థకమే





కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూన్ 22: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో జరిగిన అవకతవకలు, అక్రమాలపై చేపట్టిన విచారణ మమ..అనిపించారనే చర్చ సాగుతోంది. డీసీఎంఎస్‌లో అక్రమాలు జరిగాయంటూ గత కొన్ని రోజులుగా వివిధ రకాల ఆరోపణలు వినిపించాయి. దీనిపై కొంత మంది వ్యక్తులు సహకారశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు పత్రికల్లో కూడా కథనాలు వెలువడ్డాయి. ఈ తరుణంలో జిల్లా కలెక్టర్ డీసీఎంఎస్‌పై వచ్చిన ఫిర్యాదుల్లో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా జిల్లా సహకార ఆడిటింగ్ ఆఫీసర్, ప్రొద్దుటూరు డివిజన్ సహకారశాఖ అధికారి సురేష్‌కుమార్ విచారణ చేపట్టారు. వచ్చిన ఆరోపణల మేరకు రికార్డుల్లో ఏమున్నదని అంశంపై పరిశీలించారు.

వాస్తవాలు తెరమరుగు..

డీసీఎంఎస్‌లో అక్రమాలు జరుగుతున్నాయంటూ సహకారశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన వ్యక్తులతో మాట్లాడి వారి వద్ద ఉన్న ఆధారాలను విచారణ అధికారి ఆరా తీస్తారని, పత్రికల్లో వచ్చిన కథనాలపై కూడా మరింత లోతుగా ఆ ఆరోపణలకు సంబంధించిన రికార్డులను పరిశీలించే అవకాశాలు ఉంటాయని అందరూ భావించారు. అంతేకాకుండా కార్యాలయంలోని బాధ్య సిబ్బందిని కూడా విచారించాల్సి ఉన్నప్పటికీ ఒక బిజినెస్ మేనేజరు మినహా ఇతర సిబ్బందితో మాట్లాడనట్లు సమాచారం. డీసీఎంఎస్‌కు సంబంధించి కడప నగరంలోని చెమ్ముమియ్యాపేట స్థలంలో, రాజంపేటలోని సొసైటీ స్థలంలో అడ్డగోలుగా అద్దెలకు ఇచ్చారని అక్కడ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలను జరుగుతున్నాయంటూ సహకారశాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. అంతేకాకుండా సొసైటీకి సంబంధించిన స్థలాలు జిల్లాలో పలుచోట్ల దురాక్రమణకు గురవుతున్నట్లు అధికారుల దృష్టికి వెళ్లినట్లు ఆరోపణలు వినిపించాయి. దీంతో పాటు కొంతమంది సిబ్బంది నియామకాలు, పదోన్నతులు, ఇంక్రిమెంట్లకు సంబంధించిన అంశాలపై కూడా ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఈ తరుణంలో సిబ్బందిని కూడా విచారించే అవకాశాలు ఉన్నప్పటికీ వీటిపై విచారణ అధికారి దృష్టి పెట్టినట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే కార్యాలయంలో అభివృద్ధి పేరుతో లిఫ్ట్ ఏర్పాటు చేశారు. ఇందులో లక్షలాది రూపాయలు పక్కదారి పట్టినట్లు ఆరోపణలున్నాయి. అదే విధంగా జీఎస్టీ కూడా వసూలు చేయకపోవడంతో సొసైటీ దాదాపు రెండున్నర లక్షల మేర నష్టపోతుందని అంశాన్ని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన తర్వాత డీసీఎంఎస్ అధికార యంత్రాంగం సంబంధిత కాంట్రాక్టరు నుంచి జీఎస్టీ వసూలు చేసినట్లు సమాచారం. విచారణలో విచారణ అధికారి సమగ్రంగా విచారణ జరిపనట్లు తెలుస్తుంది.

ఆలస్యంగా విచారణ

వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టాలంటే కలెక్టరు ఆదేశించిన కొన్ని నెలల తరువాత విచారణ ప్రారంభమైంది. వివిధ కారణాలు చెబుతూ అధికారులు విచారణను మరుగున పడేశారు. అయితే ఇప్పటికీ కూడా సమగ్రంగా విచారణ జరపకుండా తూతూ మంత్రంగా ముగించారనే చర్చ సాగుతుంది. దీంతో అక్రమార్కులకు అధికారుల సహకారం ఉంటుందనే ఆరోపణలకు బలం చేకూరినట్లయింది. గతంలో జరిగిన వివిధ తప్పిదాలపై చర్యలు తీసుకోవాలంటూ స్వయంగా కలెక్టర్ డీసీఎంఎస్ పీఐసీ కమిటీని ఆదేశించినట్లు తెలుస్తోంది. కానీ ఆ ఆదేశాలను బుట్టదాఖలు చేసినట్లు సమాచారం. ఇప్పుడొచ్చిన ఆరోపణలపై విచారణ అధికారి ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు ఉండొచ్చనేది స్పష్టమవుతుంది.

సమగ్ర విచారణ జరిపితే..

వైసీపీ ప్రభుత్వం నామినేటెడ్ కింద నియమించిన పీఐసీ కమిటీ ఆధ్వర్యంలో అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు వస్తున్న క్రమంలో విచారణ నామమాత్రంగా చేపట్టి అధికారులు సహకారం అందిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. డీసీఎంఎస్ కమిటీలో కో ఆపరేటివ్ అధికారి కూడా ఎక్స్‌అఫిషియో మెంబరుగా ఉంటారు. ఇంత భారీ స్థాయిలో అక్రమాలు జరుగుతుంటే ఎందుకు ప్రేక్షకపాత్ర వహించారనేది కూడా అనుమానం కలిగిస్తుంది. ఏదిఏమైనా కో ఆపరేటివ్ యాక్ట్ సెక్షన్ 51 ప్రకారం విచారణ చేపడితే వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. విచారణ వ్యవహారంపై జిల్లా సహకార అధికారి సుభాషిణిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. నివేదిక వచ్చిందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.



కూలిన బాహుదా నది వంతెన

● రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నిమ్మనపల్లి, జూన్ 22: మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి సమీపంలో ఉన్న బాహుదానది వంతెన శుక్రవారం రాత్రి ఒకవైపు కూలిపోయింది. నిమ్మనపల్లి-వాల్మీకిపురం వెళ్లే మార్గంలో బాహుదా వంతెనను నిర్మించగా ఆదే మార్గంలో నిమ్మనపల్లితో పాటు దాదాపు పది గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణం సాగిస్తుంటారు. వంతెన సగం వరకు విరిగిపోగా మిగిలిన భాగంలో ఇతర వాహనాలు వెళుతున్నాయి. అయితే పెద్ద వాహనాలు ఇదే మార్గం గుండా వెళితే పూర్తిగా వంతెన పడిపోయే ప్రమాదం ఉంది. అంతే కాకుండా సమీప గ్రామాల్లో ఉండే ప్రజలు ఎలాంటి అవసరం ఉన్నా నిమ్మనపల్లి రావాల్సి ఉంటుంది. సగం వంతెన కూలగా రాత్రి సమయాల్లో ఇదే మార్గంలో వెళ్లే వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలోనే బాహుదా వంతెన కూలుతుందని ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురించినా అధికారులు స్పందించలేదు. ప్రస్తుతం వంతెన కూలిన చోట రాళ్లు పెట్టి వాటికి తెల్లటి రంగు వేసి చెట్టు కొమ్మలను అడ్డుగా పెట్టారు. దీంతో సమీప గ్రామస్తులు మాట్లాడుతూ ప్రధాన రహదారిలో ఉన్న బాహుదా వంతెన కూలడంతో నిమ్మనపల్లికి వెళ్లలేకపోతున్నామని మిగిలిన దారిలోనే పోవాల్సి వస్తుందని తెలిపారు. అధికారులు స్పందించి వంతెనను నిర్మించాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయ అర్హత పరీక్షను నిర్వహించాలి

● ఎమ్మెల్సీల వినతి



మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీలు

పులివెందుల టౌన్, జూన్ 22: ఈ ఏడాది బీఈడీ, డీఈడీ కోర్సులను పూర్తిచేసిన వారికి వీలైనంత త్వరగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించాలని ఎమ్మెల్సీలు కోరారు. శనివారం రాష్ట్ర ఐటీ, విద్య మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఎమ్మెల్సీలు రామగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్, చిరంజీవి, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తాజాగా అర్హత సాధించిన అభ్యర్థులు రాబోయే ఉపాధ్యాయ నియామకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, కావున వెంటనే టెట్ పరీక్ష నిర్వహించాలని కోరుతున్నామన్నారు. తమ విన్నపానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

బిల్లులపై నిలదీయండి

● నెత్తిన పెట్టుకున్న వారికి కాదని.. కమిషన్ ఇచ్చే వారికే బిల్లుల చెల్లింపులు : బీటెక్ రవి



పులివెందుల, జూన్ 22: మా బిల్లుల పరిస్థితి ఏంటి అని పులివెందులకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నిలదీయాలని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. శనివారం విజయవాడ నుంచి బీటెక్ రవి వీడియోను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పులివెందుల అభివృద్ధి కోసం పాడా అనే సంస్థను ఏర్పాటు చేసి దాదాపు రూ.700కోట్ల పనులు చేశారన్నారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వంలో చేసిన నీరు-చెట్టు పనులకు బిల్లులు చెల్లించలేదు.. తర్వాత మన ప్రభుత్వం వచ్చినా నీరు- చెట్టు బిల్లులు చెల్లించకుండా వారిని ఇబ్బంది పెట్టామని, అలాగే మమ్మల్ని కూడా 2024 ఎన్నికల్లో మన ప్రభుత్వం అధికారంలోకి రాకపోతే ఇబ్బంది పెడతారని.. మా బిల్లులు మాకు ఇప్పించాలని జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డికి మొర ఎంత పెట్టుకున్నా వారికి మాయమాటలు చెప్పి పబ్బం గడుపుతూ బిల్లులు చేయకుండా మొండిచేయి చూపారన్నారు. కౌంటింగ్‌కు నాలుగురోజులు ముందు పులివెందుల మెడికల్ కళాశాలకు రూ.100 కోట్లు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంస్థలకు వేల కోట్లు విడుదల చేయడం జరిగిందని, కానీ పులివెందుల పాడా పనులు చేసిన నాలయకులకు రిక్తహస్తాలు చూపించారన్నారు. పులివెందుల నాయకులకు బిల్లులు చేస్తే ఏమీ రాదు.. అదే రామచంద్రారెడ్డికి చేస్తే పదిశాతం కమిషన్ వస్తుందని జగన్ బిల్లులు చేశారన్నారు. రాష్ట్రంలో ఇంత వ్యతిరేకతలో 60 వేలకు పైగా మెజారిటీ ఇచ్చారంటూ... దీన్ని బట్టి ఏ మేరకు జగన్‌పై అభిమానం ఉందో అర్థమవుతుందని, ప్రాణాలకు తెగించి పోరాడుతూ జగన్‌రెడ్డిని ఈ ప్రాంత వాసులు నెత్తిన పెట్టుకుంటున్నా.. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విషయం అర్థమవుతుందన్నారు. జగన్ మా మీద కక్షసాధింపు చేసినట్లు మేము చేయమన్నారు. పులివెందుల నాయకులు కూడా మా ప్రాంత వాసులేనని.. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పాడాలో జరిగిన పనులకు సంబంధించిన బిల్లులను నిలిపివేయకుండా మంజూరు చేయాలని సిఫారసు కూడా చేస్తామన్నారు. పులివెందుల ప్రజల మీద జగన్‌మోహన్‌రెడ్డికి అభిమానం లేదని.. కేవలం తన సొంత అక్రమార్జనకే ప్రాముఖ్యత ఇస్తున్నాడని.. ఆ విషయాన్ని గ్రహించాలని పులివెందుల వాసులను కోరారు.

మున్సిపాలిటీలో సిబ్బంది కొరత

● అన్ని సెక్షన్లలో ఇబ్బందులు ● కుంటుపడుతున్న పురపాలన

● కొత్త ప్రభుత్వంలోనైనా భర్తీలు జరిగేనా..



ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం

ప్రొద్దుటూరు, జూన్ 22: మున్సిపాలిటీలలో మంచి పరిపాలన సాగాలంటే పాలక మండలితో పాటు సమాజ అభివృద్ధిపై దృష్టి కలిగిన ప్రజా ప్రతినిధులు వుండాలి. సమయానుకూలంగా పనులు పూర్తి చేయగలిగే సమర్థులైన అధికారులతో పాటు క్రమశిక్షణతో పనిచేసే సిబ్బంది వుండాలి. అప్పుడే ఆ మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుంది. కానీ ప్రొద్దుటూరులో మున్సిపాలిటీలో తగినంత మేరకు అధికారులు, సిబ్బంది లేక పురపాలన కుంటుపడుతోంది. దీన్ని అధిగమించడానికి కొత్తగా కొలువుదీరిన టీడీపీ ప్రభుత్వం సిబ్బంది కొరతను తీర్చడానికి చర్యలు తీసుకోవాలి.

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఖాళీలు

కమిషనర్ తరువాత అంతటి బాధ్యతాయుతమైన అసిస్టెంట్ కమిషనర్ పోస్టు ఖాళీ వుంది. గతంలో ఇక్కడ పనిచేసిన రంగస్వామి అసిస్టెంట్ కమిషనర్, మేనేజర్, రెవెన్యూ ఆఫీసర్ మూడు పోస్టులను చేసేవారు. మున్సిపల్ ప్రధాన కార్యాలయంలో ఇప్పుడు అసి స్టెంట్ కమిషనర్‌తో పాటు కీలకమైన మేనేజర్, రెవెన్యూ సెక్షన్‌కు రెవెన్యూ ఆఫీసర్ పోస్టు ఖాళీగా వుంది. దీంతో పరిపాలన బాగా కుంటుపడుతోంది. ఇక్కడ ఉన్న అకౌంట్స్ ఆఫీసర్ డి.వెంకటరామిరెడ్డి డిప్యూటేషన్‌పై నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో వుంటున్నారు. ఆరుగురు సీనియర్ అసిస్టెంట్లలో వినోద్‌కుమార్ అనే ఉద్యోగి డిప్యూటేషన్‌పై అనంత పురం ఆర్‌డీ ఆఫీసులో పనిచేస్తున్నాడు. సీనియర్ అకౌంటెంట్లు ముగ్గురికి గాను ఒకరు మాత్రమే పని చేస్తున్నారు. మరో రెండు పోస్టులు ఖాళీ వున్నాయి. జూనియర్ అకౌం టెంట్లకు కూడా ముగ్గురికి గాను కేవలం ఒక్కరు మాత్రమే చేస్తున్నారు. మరో రెండు ఖాళీలు వున్నాయి. జూనియర్ అసిస్టెంట్లు 17 మందికి 16 మంది ఉన్నారు. ఒక్క జూనియర్ అసిస్టెంట్ ఖాళీ వుంది. అయితే ఈ 16 మందిలో నలుగురు డిప్యూటేషన్‌పై పెట్రోల్ బంకులో ఒకరు, కలెక్టర్ కార్యాలయంలో ఒకరు, రెండో వార్డు స్కూలులో ఒకరు, మున్సిపల్ పార్కు గ్రంథాలయంలో ఒకరు పనిచేస్తున్నారు. బిల్ కలెక్టర్లు 12 మంది ఉండాల్సి వుండగా... కేవలం ఇద్దరు మాత్రమే వున్నారు. రికార్డు అసిస్టెంట్లు ఏడుగురు ఉండాల్సి ఉండగా.. కేవలం ఒకరు మాత్రమే వున్నారు. అటెండర్లు 10 మందికి ఆరుగురు ఉన్నారు. ఇంకా నాలుగు ఖాళీలు వున్నాయి.

టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో...

ఈ సెక్షన్‌లో ఇద్దరు అసిస్టెంట్ సిటీ ప్లానర్లకు గాను ఒక్కరు మాత్రమే వున్నారు. టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణమ్మ డిప్యూటేషన్‌పై రాజంపేటకు వెళ్ళింది. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు ఇద్దరు వుండాల్సి వుండగా రెండు ఖాళీలు వున్నాయి. టీపీబీవో నలుగురు వుండాల్సి వుండగా నాలుగు పోస్టులు ఖాళీగా వున్నాయి. ఇద్దరు చైన్‌మెన్‌లు కు ఒక్కరు రెవెన్యూ సెక్షన్‌లో డిప్యూటేషన్‌పై వున్నారు. మరో చైన్‌మెన్ పోస్టు ఖాళీ వుంది.

ఇంజనీరింగ్ సెక్షన్‌లో...

ఈ సెక్షన్‌లో 7 మంది ఏఈ లు వుండాల్సివుండగా ముగ్గురు మాత్రమే వున్నారు. క్లీనర్లు 14 మందికి గాను 6 మంది మాత్రమే వున్నారు. రోడ్డు గ్యాంగ్‌లేబర్ 28 మందికి గాను 10 మంది మాత్రమేవున్నారు. పైప్‌లైన్ ఫిట్టర్ ఒకరు మాత్రమే వున్నారు. పార్కు కూలిలు 11 మందకి గాను 6 మందివున్నారు. 9 మంది వాచ్ మెన్‌లకు గాను ఇద్దరు మాత్రమే వున్నారు. ఫిట్టర్ కూలీలలో 10 మందికి గాను 5 మంది వున్నారుహెల్పర్ 8మంది ఖాళీలు వున్నాయి. మున్సిపల్ ఇంజనీరుతో పాటు ముగ్గురు డీఈలు వున్నారు. టర్న్‌కాక్‌లు నలుగురు వుండాల్సివుండగా ఇక్కరు మాత్రమేవున్నారు, ఎలక్ట్రిషన్స్ ముగ్గురుకుముగ్గురు వున్నారు. లైటింగ్ సూరిండెంట్ వున్నారు.

పబ్లిక్ హెల్త్ సెక్షన్‌లో...

ఈ సెక్షన్‌లో ప్రధానమైన శానిటరీ సూపర్‌వైజర్ పోస్టు దాదాపు 10 సంవత్సరాలుగా ఖాళీగా వుంది. గతంలో రమేష్ శానిటరీ సూపర్‌వైజర్‌గా వుండి రిటైర్డ్ అయ్యారు. నాలుగు శానిటరీ డివిజన్ కార్యాలయాలు ఉండగా నలుగురు ఇన్‌స్పెక్టర్లు వున్నారు. శానిటరీ మేస్త్రీలు మాత్రం 10 మందికి కేవలం ఆరుగురు వున్నారు. ఇంకా నలుగురిని భర్తీ చేయాల్సి వుంది. హెల్త్ అసిస్టెంట్లు ఇద్దరు వున్నారు. మెటర్నిటీ అసిస్టెంట్ పోస్టులు మూడు ఉండగా.. ఒక్కరు మాత్రమే వున్నారు. డ్రైవర్లు 10 మంది వుండాల్సి వుండగా ఒక్కరూ లేరు. డ్రైన్‌క్లీనర్‌లో 31 మంది వుండాల్సి ఉండగా.. 9మంది పనిచేస్తున్నారు. 22 ఖాళీలు వున్నాయి. పీహెచ్ వర్కర్లు 73 మంది ఉండగా.. 51 మంది పనిచేస్తుండగా 22 పోస్టులు ఖాళీగా వున్నాయి. స్వీపర్లు 65 మందికి గాను 32 మంది పనిచేస్తున్నారు. ఇంకా 33 ఖాళీలు వున్నాయి. ఆయాలు ముగ్గురుకు ఒక్కరు మాత్రమే చేస్తున్నారు. ట్రాక్టర్ వర్కర్లు 16 మందికి 7 మంది పనిచేస్తున్నారు. 9 పోస్టులు ఖాళీ ఉన్నాయి. క్లీనర్‌లు ఇద్దరు, మలేరియా మజ్దూర్‌లు ముగ్గురు మార్కెట్ స్వీపర్ ఒకటి, మెడికల్ ఆఫీసర్లు ఇద్దరు, హెల్త్ విజిటర్‌లు ఒకరు, ఫార్మసిస్టులు ఇద్దరు ఉండాల్సి ఉండగా.. ఈ పోస్టులన్నీ ఖాళీ వున్నాయి. ఈ పోస్టులన్నీ పర్మినెంట్ పోస్టులు. పర్మినెంట్ పీహెచ్ వర్కర్లు ఇప్పుడు 108 మంది పనిచేస్తుండగా.. ఔట్ సోర్సింగ్ కింద 238 మంది పనిచేస్తున్నారు. నాన్ పీహెచ్ కింద 46 మంది రెగ్యులర్‌గా పనిచేస్తుండగా, 108మంది ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్నారు. ఇవికాక కోవిడ్ సమయంలో 90 మంది వర్కర్లును తాత్కాలిక ప్రాతిపదిన పనిలోకి తీసుకున్నారు. ప్రస్తుతం వారిని కూడా ప్రతి మూడు నెలలకు ఒకసారి కౌన్సిల్ అనుమతితో కొనసాగిస్తున్నారు.

కొలువుతీరిన టీడీపీ కొత్త ప్రభుత్వంలో పర్మినెంట్ ఉద్యోగులను బదిలీలపై భర్తీ చేసి మున్సిపల్ పాలనను మెరుగు పరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి మున్సిపల్ పాలనపై దృష్టి పెట్టి ఖాళీగా వున్న అధికారులు, సిబ్బంది స్థానాలను భర్తీ చేయాలని కోరుతున్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

● జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్

కడప(కలెక్టరేట్), జూన్ 22: డయేరియా నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం జేసీ తన ఛాంబరులో అతిసార కేసుల వ్యాప్తి, నియంత్రణ (స్టాప్ డయేరియా క్యాంపెయిన్)పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్సు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ డయేరియా నియంత్రణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, చర్యలపై జులై నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమం జిల్లాలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే రిమ్స్, జిల్లా ఆసుపత్రి, సీహెచ్‌సీ, పీహెచ్‌సీలతో పాటు అర్బన్ హెల్త్ సెంటర్లు, వీహెచ్‌సీలు, అంగన్వాడీ సెంటర్లలో ఓఆర్ఎస్, జింకు కార్నర్స్ ఏర్పాటు చేయాలన్నారు. జూన్ 13 నుంచి 31 వరకు అన్ని ప్రాథమిక ఆసుపత్రులలో, ఎంఎల్‌హెచ్‌పీలకు, ఆరోగ్య కార్యకర్తలకు, అంగన్వాడీ, ఆశాలకు ఓఆర్ఎస్, జింకు కార్నర్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలకు డయేరియా సోకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలు చనిపోకుండా చూడడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. తాగునీటి పైపులైన్‌లు లీకేజీ కాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నీటి వనరులు, బావులను క్లోరినేషన్ చేయడం, కలుషిత నీరు సరఫరా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. డయేరియాకు గురైన ప్రాంతాలపై వైద్యశాఖ, నీటి సరఫరా, పంచాయతీ, మున్సిపాలిటీశాఖలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మందులు సరఫరా చేయాలన్నారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే అవకాశాలున్నాయని, కాచి వడపోసిన నీరు తాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలోని తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్వహణ పక్కాగా ఉండాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ డయేరియాకు సంబంధించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింకు మాత్రలు అన్ని గ్రామాల హెల్త్ క్లీనిక్‌లలో, అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ ప్రభాకర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వీరయ్య, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డీఈవో అనురాధ, డీఐఓ డాక్టర్ ఉమమహేశ్వర కుమార్, డాక్టర్ రవిబాబు, డీసీహెచ్ఎస్ హిమబిందు, డాక్టర్ నాగశిభూషణ్ రెడ్డి, డాక్టర్ సురేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

ఆక్రమణలతో ఇరుకైన మెయిన్ బజార్

పోటీపడి ఆక్రమణలు ● నడిరోడ్డుపైనే వాహనాల నిలుపుదల ● పట్టించుకోని పోలీసులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు
ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు ● ప్రమాదాలకు నిలయంగా మారుతోందని స్థానికుల ఆందోళన

ఎర్రగుంట్ల, జూన్ 22: ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీప మెయిన్‌రోడ్డులో ఇటీవల ఆక్రమణలు భారీగా పెరిగిపోయాయి. అత్యంత దారుణంగా ఉన్న ఈరోడ్డును ఇటీవలే ఆర్‌అండ్‌బీ వారు సీసీ రోడ్డు వేసి బాగుచేశారు. అయితే సీసీరోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాన్ని ఖాళీగా వదిలేశారు. దీంతో రెండువైపులా ఉన్న దుకాణదారులు ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుని ప్రయాణికులకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. సీసీరోడ్డు వరకు మట్టిని వేసుకుని అక్కడి నుంచి వాహనాలను కనీసం పార్కింగ్‌కూడా చేసుకోనీయకుండా బోర్డులు అడ్డంగా పెడుతున్నారు. దీంతో ఈ మార్గం గుండా వచ్చే ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు నడిరోడ్డుపైనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం చేస్తున్నారు. ఎంతో విశాలంగా ఉన్న ఈరోడ్డు ఒక్కసారిగా ఇరుగ్గా మారిపోయింది. మూడు వాహనాలు ఒకేసారి వెళ్లేందుకు వీలున్న ఈమార్గాన్ని సీసీ రోడ్డు వేయగానే దుకాణదారుల దుశ్చర్యలతో ఒక వాహనం ఆగితే రెండో వాహనం వెళ్లేందుకు వీల్లేకుండా పోయింది. ముఖ్యంగా రైల్వే ప్రయాణికులు ఎంతో దూరం నుంచి వాహనాల్లో, బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఆతురతతో వెళ్లే ప్రయాణికులకు వీరు అడ్డంకిగా మారారు. కొన్ని అత్యవసర సందర్భాల్లో రైళ్లను కూడా మిస్ అయ్యే పరిస్థితి తీసుకొచ్చారు.

● రైల్వేస్టేషన్ కు వెళ్లే, వచ్చే దారి వద్ద రోడ్డుకు ఇరువైపులా ప్రయాణికులు భారీగా వుంటారు. ఈ ప్రాంతంలో చెట్లను నరికి రోడ్డు పక్కనే వేసి ప్రయాణికులు నిల్చునే వీల్లేకుండా చేశారు. దాతల సౌలభ్యంతో నిర్మించిన బస్‌స్టాప్‌ను కనిపించకుండా చేశారు. దాన్ని అధ్వాన్నంగా మార్చారు. హోటళ్లవారు ఒకరినొకరు పోటీపడి తమ దుకాణాలను రోజురోజుకూ మరీ ముందుకు సాగిస్తున్నారు. సీసీ రోడ్డు వరకు బోర్డులను అడ్డంగా పెట్టడం, పొవ్వులను కూడా పెడుతుండంతో బస్సులు నడిరోడ్డుపైనే నిలపాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో రైల్వేస్టేషన్‌కు వెళ్లే, వచ్చే వాహనాలు అక్కడే ఆగిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ కూడా జామవుతోంది. దీనికి తోడు తోపుడు బళ్లు కూడా మేమేమీ తక్కువ కాదన్నట్లు రోడ్డుపైనే పెడుతుండడంతో పరిస్థితి మరీ దారుణంగా మారింది. దీనికి తోడు ప్రభుత్వ మద్యం షాపు వద్ద సాయంత్రం పూట ద్విచక్ర వాహనదారులు రోడ్డుపైనే నిలిపి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. సాయంత్రం ఇక్కడ తిరుణాళ్ల వాతావరణం ఉంటుంది. అంతా రోడ్లపైకి వచ్చేస్తే ఇక ప్రయాణికులకు భద్రత ఎక్కడుంటుందని వాహనచోదకులు ఆగ్రహిస్తున్నారు. ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదని, పైగా వారి దుకాణాల వద్దకు వచ్చి టీతాగి, ఎంచక్కా బాతాఖాని చేసి, వాటర్ బాటిల్స్‌కూడా కొందరు ఉచితంగా తీసుకెళుతున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రజల ఇబ్బందులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. కళ్లెదుటే ఆక్రమణలు పెరిగిపోతున్నా పట్టించుకోకపోవడం దారుణమని ప్రజలు, ప్రయాణికులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. గతంలో నరపంచాయతీ కమిషనర్‌గా పనిచేసిన భవాని ప్రసాద్ ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. నగరపంచాయతీ స్థలం వరకు మార్కింగ్ వేశారు. అయితే వాటిని పూర్తిగా చెరిపేసి దుకాణదారులు భారీగా ముందుకు వచ్చేశారని ప్రజలు విమర్శిస్తున్నారు.




రోడ్డుకు అనుకుని హోటల్ బోర్డు - నడిరోడ్డుపై ఆపిన ఆర్టీసీ బస్సులు...రోడ్డుపైనే ప్రయాణికులు

మాకేం సంబంధం లేదన్నట్లు అధికారులు

ఇక నగరపంచాయతీ అధికారులు పూర్తిగా నిద్రావస్థలో, మామ్మూళ్ల మత్తులో జోగుతున్నసంగతి తెలిసిందే. దుకాణదారులు ఆక్రమిస్తుంటే తమకేమీ సంబంధం లేదన్నట్లు చూసీచూడనట్లుగా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు తీరుంది. ప్రజల అవస్థలను గాలికొదిలేసి కార్యాలయానికే పరిమితమై పాలన సాగిస్తున్నారని ప్రజలు పెద్దఎత్తున విమర్శిస్తున్నారు.

మోటార్‌సైకిళ్ల వేగంతో ఇబ్బందులు

ఇక్కడ మోటార్‌సైకిళ్ల వేగం భరించలేకున్నామని రైల్వే ప్రయాణికులు వాపోతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ఆకతాయిలు ప్రయాణికులు వెళ్లే సమయంలో అడ్డంగా వెళ్ల భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు.

ఆక్రమణలు తొలగింపు చర్యలు తీసుకుంటాం

ఆక్రమణలను ఉపేకించం. తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ఈశ్వరయ్య, సీఐ ఎర్రగుంట్ల

నగరపంచాయతీ వారికి ఫిర్యాదు చేస్తాం

రోడ్డుకు ఇరుపైపులా రోజురోజుకూ ఆక్రమణలు ఎక్కువ అవుతున్నాయి. వీటిపై నగరపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేస్తాం. వాహనాల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం. సీసీ రోడ్డుకు ఇరువైపులా 1.5మీటర్ల వరకు గ్రావెల్‌ను నింపుతాం.

రామక్రిష్ణయ్య, ఏఈ ఆర్‌అండ్‌బీ

కోదండరాముడి సేవలో హర్యాన, పంజాబ్ హైకోర్టు న్యాయమూర్తులు



ఒంటిమిట్ట, జూన్ 22: కోదండరామస్వామి దేవాలయాన్ని శనివారం హర్యాన రాష్ట్ర హైకోర్టు జడ్జి సురేంద్రగుప్తా, పంజాబ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి అంకిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మూల విరాట్టు సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగ మండపంలో ఆలయ విశిష్ట తను తెలుసుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మద్యం మత్తులో ప్రయాణికుడి వీరంగం



మద్యం మత్తులో వీరంగం సృష్టిస్తున్న చెంద్రాయుడు

నందలూరు, జూన్ 22: మద్యం మత్తులో ఓ ప్రయాణికుడు వీరంగం సృష్టించాడు. కడప నుంచి రాజంపేటకు వస్తున్న పల్లెవెలుగు బస్సులో ఆకేపాడు, హస్తవరం వద్ద కొతపల్లె వాసి దండె చెంద్రాయుడు మద్యం మత్తులో కడపలో బస్సు ఎక్కి టిక్కెట్ తీసుకోకుండా కండక్టర్, డ్రైవర్, తోటి ప్రయాణికులతో ఘర్షణకు దిగాడు. ఇదేమి అన్యాయమని ప్రశ్నించిన మహిళా ప్రయాణికురాలిపై పాదరక్షతో దాడి చేయడంతో నందలూరు పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. మద్యం మత్తు దిగకపోవడంతో పోలీసుస్టేషన్‌లో సైతం వీరంగం సృష్టించారు. ఆర్‌టీసీ డ్రైవర్, కండక్టర్ ఫిర్యాదుతో ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ కేసు నమోదు చేశారు.

యువరచయితలకు అవకాశం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 22: జాతీయ తెలుగు యువ రచయితల సమ్మేళనంలో పాల్గొనడానికి 40 ఏళ్లలోపు యువరచయితలకు అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం తెలిపారు. డిసెంబరు 28, 29 తేదీల్లో క్రిష్ణాజిల్లా రచయితల సంఘం సహకారంతో ప్రపంచ తెలుగు రచయితల ఆధ్వర్యంలో విజయవాడలో జాతీయ తెలుగుయువరచయితల సమావేశం జరుగుతుందని తెలిపారు. రెండు రోజుల శిక్షణ శిబిరంలో పద్యరచన, వచన కవిత, నవల, గేయం, నాటకం, వ్యాసరచన పక్రియలో సుప్రసిద్ధ రచయితలతో శిక్షణ ఇప్పించి ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరిస్తామని తెలిపారు. యువరచయితలు ఈ అవకాశం సద్వినియోగ చేసుకోవాలని తెలిపారు.

వైభవంగా కోదండరాముని కల్యాణం



కల్యాణోత్సవం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో సీతారాములు

ఒంటిమిట్ట, జూన్ 22: ఏకశిలానగరి కోదండరామాలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులైన సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణమండపం వద్ద ఉంచి కల్యాణతంతును ప్రారంభించారు. విష్వక్సేనపూజ, పుణ్యావచనం, కంకణధారణ, యజ్ఞోపవితరణ కార్యక్రమం నిర్వహించిన అనంతరం మాంగళ్యధారణను వైష్ణవ సంప్రదాయంలో ఆగమ శాస్త్ర ప్రకారం టీటీడీ అర్చకులు సీతమ్మ తల్లికి మాంగళ్యధారణ చేశారు.



హాజరైన భక్తులు

అనంతరం తలంబ్రాల సమర్పణ, పూలచెండుల మార్పిడి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్, సిబ్బంది నాయక్, ప్రవీణ్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వైసీపీలా అవినీతి చేయం... చేయనివ్వం

● ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ నిజాయితీపరుడు
● మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి



ఖాజీపేట, జూన్ 22: టీడీపీ ప్రభుత్వం అవినీతి చేయదని, ఎవరినీ చేయనివ్వదని, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నిజాయితీపరుడని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ వారసత్వపు రాజకీయాలకు మైదుకూరు ప్రజలు బుద్ధి చెప్పారని, ప్రభుత్వం మారినా అధికారుల్లో ఇంకా మార్పు రాలేదన్నారు. చాపాడు మండలం కుచ్చుపాప రెవెన్యూలో మాజీ ఎమ్మెల్యే 36 ఎకరాలు ఆక్రమించుకుని చేపల చెరువుకు కౌలుకు ఇచ్చారని, ఇప్పుడు స్థానిక భూములు గల ఎస్సీలు తిరగబడ్డారని, ఆ భూములపై ఎమ్మెల్యే పుట్టాకు ఫిర్యాదు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో కొత్త సబ్‌స్టేషన్లు వచ్చాయని, వాటిల్లో షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షలు మాజీ ఎమ్మెల్యే తీసుకున్నాడని, ఆ విషయమై ఎమ్మెల్యే పుట్టా డీఈకి ఫిర్యాదు చేశారని డీఎల్ తెలిపారు. మిట్టమానుపల్లెలో హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తామని రూ.7 లక్షలు తీసుకున్నారన్నారు. ఇలా చెప్పుకుంటూపోతే మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అరాచకాలు మరెన్నో ఉన్నాయన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే అవినీతి చేయడు, అవినీతిని చేయనివ్వనని చెప్పాడన్నారు. ఖాజీపేటలో వైసీపీ హయాంలో రేషన్ బియ్యం అమ్ముకుని బైపాస్ రోడ్డులో విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్న వ్యక్తిపై కూడా చర్యలు తీసుకుంటామని ఇలాంటి వ్యక్తులు ఎలా అక్రమాలకు పాల్పడుతున్నారో అధికారులు గుర్తించాలన్నారు. మైదుకూరులో ఉన్న బార్ కోదండరాముని దేవాలయం భూమిలో ఉందని, అక్రమాలకు పాల్పడిన ఎక్సైజ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఖాజీపేట పంచాయతీ పరిధిలో రూ.3 లక్షలతో రోడ్డు వేసి రూ.13 లక్షలు స్వాహా చేశారని, దానిపై ఫిర్యాదు చేసి వారిపై చర్యలు తీసుకునేలా చేస్తామని తెలిపారు.

మేడ మీది నుంచి పడిన భవననిర్మాణ కార్మికుడు

ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న కార్మికుడు



భవననిర్మాణ కార్మికుడు

ప్రొద్దుటూరు, జూన్ 22: మేడమీద గోడలకు పూత పనిచేస్తూ ప్రమాదవ శాత్తు కిందపడి విద్యుత్ తీగలు తగిలి భవననిర్మాణ కార్మికుడు వంశీ తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాల్లోకెళితే... తాళ్ళమాపురం వాసి వంశీ బేల్దారి పనిచేస్తాడు. ప్రొద్దుటూరు పట్టణం నాగేంద్రనగర్ కుండావారి షాపువద్ద భవన నిర్మాణం పనికి వచ్చి ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో వున్నారు. శరీరం దాదాపు 60 శాతం శరీరం కాలిపోయింది. సచివాయ సిబ్బంది సంఘటనా స్థలంలో పడివున్న వంశీని వాహనంలో ఎక్కించి ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్ళారు. పరిస్థితి విషమంగా వుందని వైద్యులు తెలపడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. వంశీ విషమ పరిస్థితిలో చికిత్స పొందుతూ చావుబతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్నారు. వంశీకి అమ్మా నాన్న లేకపోవడంతో చిన్నమ్మ దగ్గర ఆశ్రయం పొందుతున్నాడు. పేదరికంలో మగ్గుతున్న ప్రాణాపాయ స్థితిలో ఉన్న భవన నిర్మాణ కార్మికుడు వంశీకి వైద్య సహాయం అందించాలని వేడుకుంటున్నారు.

సాత్విక భేరి మోగించిన రమణారెడ్డి

● వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 22: స్వతంత్రమైన విచారణ శక్తితో భగవంతుడు, ఆత్మ ప్రజ్ఞానం పరమాత్మ వంటి ఆధ్యాత్మిక పదాలకు కొత్త నిర్వచనం చెప్పి విద్వాన్ రమణారెడ్డి సాత్విక భేరి మోగించాడని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు, జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రమణారెడ్డి రచించిన ప్రజ్ఞాన ప్రకాశిక పుస్తకావిష్కరణ చేశారు. రమణారెడ్డి మొదట సాక్షాత్కారం, తరువాత గీర్వాణి తిలకం, గీతాంజలి రచించారని ఇప్పుడు ఆయన రచించిన ప్రజ్ఞాన ప్రకాశిక జ్ఞాన పరిణతికి నిదర్శనంగా చెప్పవచ్చన్నారు. ఈ గ్రంథంలో ఆయన ద్వైత, అద్వైత విశిష్ట అద్వైతాలను క్షుణ్ణంగా పరిశీలించి త్రిమతాల సాత్విక చింతననుచారిత్రక దృక్పదంతో విశ్లేషించారన్నారు. ప్రొఫెసరు మూలమల్లికార్జునరెడ్డి, ప్రొఫెసరు గుర్విరెడ్డిగారి శివారెడ్డి, ప్రొఫెసరు నల్లపురెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి ప్రొఫెసరు ఎస్.ఈశ్వర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

వ్యక్తి దారుణ హత్య

తాగివుండగా గుర్తుతెలియని వారి దాడి ● హత్య కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రొద్దుటూరు, జూన్ 22: మద్యం మత్తులోవున్న అర్షద్(37)ను గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో తలపై మోది దారుణంగా చంపారని పోలీసులు తెలిపారు. వివరాల్లోకెళితే...

రామేశ్వరం రోడ్డు వసంతపేట ఏరియాలో ప్రభుత్వ వైన్ షాపు, బార్‌అండ్ రెస్టారెంట్ వుంది. ఇక్కడ మద్యం ప్రియులు రోడ్లపై మద్యం తాగుతూ వీరంగం చేస్తుంటారు. ఈ తాగుబోతుల వలన రోజు ఆ రోడ్డులో వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఉదయం నుంచి రాత్రివరకు తాగుబోతులు రోడ్లపై మద్యం తాగి తరచూ గొడవలు పడుతుంటారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు ప్రభుత్వ వైన్‌షాపు సమీపంలో తాగిపడి వున్న అర్షద్‌పై కొందరు గుర్తు తెలియని దుండగులు బండరాయితో దాడి చేసి చంపారు. రామేశ్వరం రోడ్డు నైట్ బీట్‌కు వచ్చిన వన్‌టౌన్ కానిస్టేబుల్ ద్వారా హత్య గుర్తించి తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్, డీఎస్పీ మురళీధర్ సంఘటనా స్థలికి వచ్చి పరిశీలించారు. హత్యకుగల కారణాలపై విచారిస్తున్నారు.



పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

హత్యకుగురైన వ్యక్తి షేక్ అర్షద్ అని, దర్గా బజార్‌కు చెందిన వాడని ఆటో డ్రైవరుగా జీవిస్తున్నాడని సీఐ శ్రీకాంత్ గుర్తించారు. శుక్రవారం అతను మద్యం తాగేందుకు వైన్ షాపుకు వచ్చి మద్యం తాగి అక్కడ పడిపోయి వుండగా అతన్ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా బండరాయితో తలపై గుద్ది హత్యచేశారన్నారు. హత్యకు గురైన అర్షద్‌సోదరుడు పర్షద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

వివాదాస్పదమైన దేవాలయం స్థలం

రోడ్డెక్కిన నర్సింగపల్లె వాసులు ● రంగప్రవేశం చేసిన పోలీసులు




నర్సింగపల్లెలో గ్రామస్తులకు సర్దిచెబుతున్న పోలీసు అధికారులు
దేవాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని రోడ్డుపై బైఠాయించిన నర్సింగపల్లె వాసులు

పోరుమామిళ్ల, జూన్ 22: దేవాలయ నిర్మాణానికి కావలసిన స్థలం కోసం ఊరంతా కదిలారు. కానీ ఆ స్థలం తనకు ప్రభుత్వం పట్టా ఇచ్చిందని అభ్యంతరం తెలిపాడు ఒక గ్రామస్తుడు. కంప తొలగించేందుకు సిద్దమయ్యారు గ్రామస్తులు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రయత్నాలు చేశారు. దేవాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని రోడ్డుపై బైఠాయించారు నర్సింగపల్లె గ్రామస్తులు. విషయం తహశీల్దారు దృష్టికి తీసుకెళ్లడంతో రికార్డులు పరిశీలించిన తరువాత చర్యలు తీసుకుంటాం, అంత వరకు సంయమనం పాటించాలని తహసీల్దారు సూచించారు. వివరాలిల్లోకెళితే....

పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీ పరిధి నరసింగపల్లెలో సర్వేనెంబరు 570లో దేవాలయ నిర్మాణాలకు గ్రామకంఠమైన ఆ స్థలం కేటాయించాలని ఎన్నో ఏళ్లగా అక్కడే దేవాలయ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించుకున్నామని గ్రామస్తులు శనివారం కంపచెట్లను తొలగించే ప్రయత్నం చేశారు. అయితే అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనకు రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో పట్టా ఇచ్చారని, అది తన స్థలమని అభ్యంతరం తెలపడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీనికి సంబంధించి పోలీసు అధికారులకు ఫిర్యాదు అందడంతో రంగప్రవేశం చేసి కంప తొలగింపు కార్యక్రమానికి అభ్యంతరం తెలిపారు. దీంతో గ్రామస్తులంతా వారితో వాగ్వాదానికి దిగి రోడ్డుపై బైఠాయించారు. దీంతో తహసీల్దారు శిరీష దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె ఇరువర్గాలతో మాట్లాడి ఆ స్థలం సంబంధించిన రికార్డులు వారి వద్ద ఏమైనా ఉంటే తీసుకురమ్మన్నారు. వాటిని పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుటామని అంత వరకు ఆ స్థలంలో ఎవరూ జోక్యం చేసుకోరాదని తెలి పారు. ప్రస్తుతానికి ఏమో సమస్య సద్దుమణిగినా మళ్లీ పునరావృతమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సోమవారం రెవెన్యూ తహసీల్దారు కార్యాలయంలో రికార్డులు అందజేయాల ని వారిని ఆదేశించారు. మరి తదుపరి చర్యలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

బ్యూటీపార్లర్‌లో చోరీ - బంగారు, నగదు అపహరణ

పెనగలూరు, జూన్ 22: స్థానిక బ్యూటీపార్లర్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఇంటి యజమాని గుంటుపల్లె పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఇనుప కటాంజనం తొలగించి లోనికి ప్రవేశించి బీరువా పగులగొట్టి అందులోని 8 తులాల బంగారు, 15 వేల నగదును అపహరించుకుని పోయినట్లు తెలిపారు. ఒకసారి 3 ఉంగరాలు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదుపై శనివారం ఉదయం క్లూస్ టీంను, డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి విచారణ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కనకలూరులో జరుగుతున్న వేణుగోపాలస్వామి ఉత్సవాలకు వెళ్లి సాంస్కృతిక కార్యక్రమాలు ముగిసిన తర్వాత 3.30 గంటలకు ఇంటికి వచ్చి చోరీ జరిగినట్లు గుర్తించారు. విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చి న్యాయం చేయాల్సిందిగా ఆమె కోరినట్లు ఆయన తెలిపారు.

జీఓ 117 రద్దు చేయాలి: పీఆర్‌టీయూ

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 22 : ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగానికి విఘాతం కలిగించిన జీఓ 117ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మిట్టా క్రిష్ణయ్య, గిరిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని దానికనుగుణంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని రద్దు చేసి 1వ తరగతి నుంచి ఐదో తరగతి వరకు పాత పద్ధతిలోనే ప్రాథమిక పాఠశాలలు కొనసాగించాలన్నారు.

నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి: ఎస్ఎఫ్ఐ

కమలాపురం రూరల్, జూన్ 22 : నీట్ పరీక్ష ఫలితాలను రద్దు చేసి మళ్లీ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను నమ్మకం కలిగించాలని ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సిద్దార్థ తెలిపారు. శనివారం కమలాపురంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని వెంటనే రద్దు చేసి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం వైద్య విద్య ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఇటీవల నీట్ ఫలితాలు భారతదేశంలోని విద్యార్థులందరినీ ఆశ్చర్యానికి గురి చేశాయని, వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వ్యవసాయ శాఖా మంత్రికి సన్మానం



అచ్చెన్నాయుడిని సన్మానిస్తున్న యాటగిరి రాంప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 22 : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని బెస్తసాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ రాంప్రసాద్ సన్మానించారు. విజయవాడలోని ఆయన స్వగృహంలో శనివారం కలిశారు. అనంతరం మాట్లాడుతూ మత్స్యశాఖలో జరుగుతున్న విషయాలతో పాటు కొంత మంది అధికారులపై ఫిర్యాదు చేయగా, వారం రోజుల్లో కలిసి నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. బెస్తసాధికార కమిటీ ప్రతినిధులు పోలిసాయి, రాము, పిల్లిసూరి పాల్గొన్నారు.

పవన్‌కు అన్నదాతల ధన్యవాదాలు

చక్రాయపేట, జూన్ 22: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రైతుల పట్ల చూపిన ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు అంటూ మాజీ జడ్పీటీసీ రాధాకృష్ణయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పట్టెం అశోక్, మహదేవపల్లె రమేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు తుపాకుల చంద్ర పేర్కొన్నారు.ఇటీవల జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రైతులకు అనుసంధానం చేయాలని డిప్యూటీ సీఎం చెప్పడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. వారు మాట్లాడుతూ రైతులు కరువుతో అల్లాడుతున్నారని, పంటలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి హామీ పథకం కేవలం చెరువుల్లో గుంతలు తవ్వడం వల్ల లాభం లేదని, అదే రైతులకు అనుసంధానం చేస్తే పనులు చేయించుకొని రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

రేపు మీకోసం కార్యక్రమం

పులివెందుల టౌన్, జూన్ 22: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమం సోమవారం నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తామని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంఈఓ కార్యాలయానికి కొత్త సొబగులు

చెన్నూరు, జూన్ 22 : మండల విద్యాశాఖ కార్యాలయం నేడు కొత్త సొబగులను సంతరించుకుంది. రంగు వెలసిన గోడలు, సరిగా లేని చప్పట, దెబ్బతిన్న కిటికీలు తలుపులు, తుప్పుబట్టిన కడ్డీలు, ఉపయోగపడని మరుగుదొడ్లు ఇలాంటి దుస్థిలో ఉన్న ఆ కార్యాలయానికి కొత్త కళను సంతరించుకుంది. ఎంఈఓగా బాధ్యతలు తీసుకున్న గంగిరెడ్డి భవనాన్ని కొత్తగా తీర్చిదిద్ది ఉపాధ్యాయులందరికీ ఉపయోగపడేలా మార్చుకున్నారు. సెలవులకు ముందు ఉపాధ్యాయులను సమావేశపరచి 'ఇది మన భవనం, మనకు ఉపయోగపడే భవనం, అందరం సహకరించుకుని బాగుచేసుకుందాం' అనడంతో ఉపాధ్యాయుల్లో చైతన్యం వచ్చింది. దీంతో వారంతా ఆ భవనానికి సహకారం అందించారు. ఫలితంగా ఆ భవనం నేడు కొత్తగా మారింది.



కొత్త హంగులతో మారిన ఎంఈవో కార్యాలయం

సమష్టి కృషితోనే సాధ్యం



మండల వ్యాప్తంగా 43 పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సుమారు 150 మంది ఎంఈఓ కార్యాలయం బాగు కోసం ఆర్థిక సాయం అందించారు. వారి స్థాయికి తగ్గట్టుగా రూ.వెయ్యి నుంచి రూ.16వేల వరకు అందించారు. సుమారు రూ.4లక్షలకు పైగా వసూలైంది. ఫలితంగా అన్ని రకాల హంగులతో భవనం కొత్తదనం సంతరిచుకుంది.

– గంగిరెడ్డి, ఎంఈఓ, చెన్నూరు

నమ్మినవారిని జగన్ నట్టేట విడిచారు

● వైసీపీ నేత మల్‌రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 22 : వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని నమ్మి తన వెంట నడిచినందుకు తమను నట్టేట విడిచారని వైఎస్ జగన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మల్‌రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2011 కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చిన తరువాత వైసీపీ స్థాపించిన నాటి నుంచి జెండా పట్టుకుని జగనే సర్వస్వం అనుకుని పనిచేసిన తనలాంటి కార్యకర్తలను జగన్ మరిచిపోయారని తెలిపారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు, డిప్యూటీ మాజీ సీఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యే రవిరెడ్డి సైతం బ్రోకర్లు, సంపన్నులకు మడుగులొత్తేవారినే పట్టించుకున్నారు కానీ తమలాంటి వారిని విడిచిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తమలాంటి కార్యకర్తలకు అండగా నిలిచి పార్టీకి పూర్వవైభవం తెస్తారని ఆశిస్తున్నామన్నారు.

రైతులకు రూ.20వేలు జమ చేయాలి

● ఏపీ రైతు సంఘం

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 22: రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు రైతుల ఖాతాల్లో వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి కోరారు. శనివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమవేశంలో మాట్లాడారు. టీడీపీ కూటమి మెజార్టీతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో వర్షాభావంతో ఒక వైపు కరువు అయితే, మరో వైపు డిసెంబరులో వచ్చిన తుఫానుతో పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని ఈ ఖరీఫ్‌లో వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతుందన్నారు. సున్నా, పావలా వడ్డీ రాయితీలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వడ్డీ అసలు కట్టాలని రైతులపై బ్యాంకులో వత్తిడి చేసి వసూలు చేస్తున్నాయన్నారు. వడ్డీ రాయితీ విడుదల చేసి రైతుల ఖాతాలో వేయాలని, ఎన్నికల ముందు టీడీపీ కూటమి ప్రకటించిన పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20వేలు రూపాయలు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు.

లేపాక్షి హస్తకళా ప్రదర్శనకు విశేష స్పందన





లేపాక్షి ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల బొమ్మలు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 22 : లేపాక్షి హస్తకళా ప్రదర్శనకు విశేష స్పందన లభించిందని ఆ సంస్థ మేనేజరు తెలిపారు. ఈ నెల 20న లేపాక్షి షోరూంలో ప్రదర్శన ప్రారంభించారు. ఐదురోజుల పాటు ఈ ప్రదర్శనలో అమ్మకాలు జరుగుతాయన్నారు. ఈ ప్రదర్శనలో ఏటికొప్పాక బొమ్మలు, కొండపల్లె బొమ్మలు, శెట్టిగుంట రాజురాణి బొమ్మలు, ఎర్రకోట మట్టి బొమ్మలు, లెదర్ పప్పెట్ బొమ్మలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేయాలి

● విద్యాశాఖ మంత్రికి టీఎన్ఎస్ఎఫ్ లేఖ

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 22 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లకు సంబంధించి నోటిఫికే షన్ విడుదల చేయాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బొజ్జ తిరుమలేశ్ డిమాండ్ చేశారు. శనివారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు లేఖను ఫ్యాక్స్ ద్వారా పంపించారు. ఆ యన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హ యాంలో పాఠశాల విద్యతో పాటు కళాశాల విద్య పూర్తి గా విచ్ఛిన్నమైందన్నారు. అకడమిక్ ఇయర్ జూన్ నెలలో ప్రారంభం కావాల్సి ఉంటే సెప్టెంబరు, అక్టోబరులో మరికొన్ని సందర్భాల్లో, నవంబరు డిసెంబరు నెలలో ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రభుత్వ విద్యప్రారంభం కా వడానికి ఆలస్యమవుతుందన్నందున ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు అధిక సంఖ్యలో జరుగుతున్నాయని అన్నారు. ప్రైవేటు డిగ్రీ కళాశాలలతో సమానంగా ప్రభుత్వ డిగ్రీకళాశాలల్లో కూడా అడ్మిషన్లు జరిగే విధంగా విద్యాశాఖమంత్రి ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

కడప డిపో కండక్టర్‌కు బహుమతి



ప్రమీలకు బహుమతి అందిస్తున్న కడప డిపో మేనేజర్

కడప (మారుతీనగర్), జూన్ 22: సీజన్ పాస్ టికెట్ల నకిలీ కార్డులతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సాగిస్తున్న ప్యాసింజర్‌ను చాకచక్యంగా గుర్తించి ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌కు అప్పగించిన కడప డిపోకు చెందిన కండక్టర్ బి.ప్రమీలకు శనివారం కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు అభినందించారు. వివరాల్లోకి వెళితే... కడప డిపోకు చెందిన ఏపీ04టీ డబ్ల్యు 6288 నెంబర్ గల ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు శనివారం ఉదయం 7.30 గంటలకు కడప డిపో నుంచి ప్రొద్దుటూరుకు బయలుదేరింది. ఆ బస్సు మైదుకూరుకు చేరుకోగానే అక్కడ నుంచి ప్రొద్దుటూరు వరకు రూ. 1200 విలువ గల సీజన్ టికెట్‌పై ప్రయాణించేందుకు మైదుకూరుకు చెందిన పి.చిన్నచెన్నయ్య (33) అనే వ్యక్తి బస్సు ఎక్కారు. పాస్‌పై స్టిక్కర్‌ను అంటించుకుని కండక్టర్‌ను బురిడీ కొట్టించే ప్రయత్నం చేయగా చాకచక్యంగా గుర్తించారు. కాగా అదే తరహాలో ప్రొద్దుటూరు నుంచి ముద్దనూరుకు ప్రయాణం చేసేందుకు వీలుగా మరో సీజన్ పాసును గుర్తించి ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పోలీసులకు అప్పగించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించిన ప్రమీలను డిపో మేనేజర్ అభినందించారు. కార్యక్రమంలో డిపో సీఐ కన్యాకుమారి, కడప డిపో మహిళా కండక్టర్లు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి



లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 22 : విజయవాడలో శనివారం విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌ను కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేశ్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. అలాగే కడప నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు శ్రావణ్‌రాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగులో ఉన్న మెస్, కాస్మటిక్ చార్జీలు చెల్లించాలి



జేడీకి వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 22 : ప్రభుత్వ వసతిగృహాల్లో పెండింగులో ఉన్న మెస్, కాస్మటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. శనివారం సోషల్ వెల్ఫేర్ జేడీ సరస్వతికి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది నెలల నుంచి పెండింగులో ఉన్న చార్జీలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనిపై వసతిగృహ అధికారులు చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు ఇవ్వాలన్నారు. దీంతో పాటు మరికొన్ని సమస్యలు తెలిపారు. పీడీఎస్‌యూ నాయకులు స్వరూప్‌తేజ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెమ్యునరేషన్ పంపిణీలో భారీ కోత



మాట్లాడుతున్న కొమ్మద్ది ఈశ్వరయ్య

కమలాపురం రూరల్, జూన్ 22 :ఇటీవల జరిగిన 2024 సాధారణ ఎన్నికల సందర్భంగా కమలాపురం నియోజకవర్గంలో వీఆర్‌ఏలకు వివిధ రకాల విధులను నిర్వర్తించడం జరిగిందని వీరికి రెమ్యునరేషన్ ఇవ్వడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించి డబ్బును భారీగా తగ్గించి ఇస్తున్నారని ఏపీ వీఆర్‌ఏల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య తెలిపారు. శనివారం కమలాపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు రెండు నెలల పాటు తనతో పాటు కొంత మంది వీఆర్‌ఏలు వెల్ఫేర్ అసిస్టెంట్లు ఫ్లయింగ్‌స్క్వాడ్ వీడియోగ్రాఫర్లుగా విధులు నిర్వహించామని, తమకు కేవలం రూ.5వేలు మాత్రమే రెమ్యునరేషన్ ఇచ్చారని, బడ్జెట్ వచ్చిన తరువాత మిగతా మొత్తం ఇస్తామని అధికారులు చెప్పడం బాధాకరమన్నారు. ఎన్నికల కమిషన్‌నిబంధన ప్రకారం ప్రతిరోజూ రూ.250 చెల్లించాలని ఉందన్నారు. రెండు నెలల పాటు తాము సొంత ఖర్చులు పెట్టుకుని విధులకు హాజరయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మేం సొంతంగా పెట్టిన ఖర్చులు కూడా ఇవ్వలేదన్నారు. వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు కోడూరు పుల్లయ్య, నేతలు మణికుమార్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం



అన్నదానం చేస్తున్న దృశ్యం

చక్రాయపేట,జూన్ 22: మండలంలోని దేవరగుట్టపల్లె-నాగులగుట్టపల్లె మధ్య వెలసిన శ్రీరామచంద్రుని తల్లిదండ్రులు కౌసల్య, సుమిత్ర, కైకేయి సమేత దశరథ మహారాజు దేవస్థానం నందు శనివారం అన్నదానం నిర్వహించారు. గత నాలుగేళ్ల నుంచి ప్రతి శనివారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. బురుజుపల్లె సర్పంచు గంగయ్య అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రామసుబ్బయ్య, సుబ్బయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగ్గా ఉండాలి

చక్రాయపేట, జూన్ 22: మండలంలో పారిశుధ్యం మెరుగ్గా ఉండాలని ఎంపీడీఓ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో తహసీల్దార్,వైద్యాధికారులు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు ఏపీఎంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పారిశుధ్యం మెరుగుపడేలా సమష్టిగా పనిచేయాలని సూచించారు.అలాగే పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సెస్ సిస్టం (పీజీఆర్ఎస్)ను ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటుచేసినందున ప్రతి సోమవారం ఉదయం 9.30గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

గంబూషియా చేపలతో దోమలకు అడ్డుకట్ట



పులివెందుల పరిధిలోని వంకలో గంబూషియ చేప పిల్లలను వదులుతున్న సిద్దయ్య

పులివెందుల రూరల్, జూన్ 22: గంబూషియ చేపలతో దోమలకు అడ్డుకట్ట పడుతుందని పులివెందుల సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. శనివారం పులివెందుల పరిధిలోని నీటికుంటలలో జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు గంబూషియ చేపపిల్లలను వదిలామన్నారు. గంబూషియ చేపలు దోమ లార్వాను ఆహారంగా తీసుకుంటాయన్నారు. దోమల సంఖ్యను నియంత్రించేందుకు వాటిని నాశనంచేసేందుకు ఈ సీజన్‌లో చెరువులు, చిన్నచిన్న కుంటల్లో,నీరునిల్వ ఉండే ప్రాంతాల్లో గంబూషియ చేపలను వదలడం జరుగుతుందన్నారు. తద్వారా దోమల పుట్టుకను అడ్డుకోవచ్చన్నారు. దోమల వల్ల డెంగ్యూ,మలేరయా,చికున్‌గునియా, బోదకాలు, మెదడువాపు వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతుంటాయన్నారు. ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమల నివారణకు సహకరించాలని కోరారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్ వెంటనే ప్రకటించాలి

● మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న మల్లు రఘునాథరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 22 : నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం ఉద్యోగులతో పరస్పర సహకార ధోరణి అవలంబించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తెలిపారు. శనివారం ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాషా ఆధ్వర్యంలో ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు పీఆర్‌సీ విషయంలో చాల అన్యాయం జరిగిందని దానిని రానున్న పీఆర్సీలో సవరించి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు మూలస్తంభం లాంటి ఉద్యోగుల పనితీరు మీద వంద శాతం ఆధారపడి ఉంటుందనేది వాస్తవం. అలాంటి ఉద్యోగులతో సహకా రధోరణిని అవలంభించడంతో పాటు వారి సమస్యల పరిష్కారం పట్ల సానుకూలత కలిగి ఉండాలన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని వేధించడం జరిగిందని గుర్తు చేశారు. ఎన్నో ఉద్యమాల ద్వారా సాధించుకున్నహెచ్ఆర్ఏ, శ్లాబులను తగ్గించడంతో పాటు రిటైర్ అయినుద్యోగుల క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పరిమితులు కూడా తగ్గించడం దారుణ చర్యగా అభివర్ణించారు. గత ప్రభుత్వం పీఆర్సీలో చేసినటువంటి నష్టాలు సవరిస్తూ మంచి పీఆర్సీ కూడా ప్రకటించాలని డిమండ్ చేశారు. పీఆర్సీ ప్రకటించేలోపు వెంటనే ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.బాలగంగిరెడ్డి, జిల్లా నాయకులు ఎం.సునీల్‌కుమార్, ఎల్.జయరాం తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్, పర్యావరణ కార్యదర్శులకు న్యాయం చేయాలి

కడప(కలెక్టరేట్), జూన్ 22: రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న వార్డు శానిటేషన్, పర్యావరణ కార్యదర్శులకు ప్రభుత్వం న్యాయం చేయాలని పర్యావరణ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హీరా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగులుగా చేరి, వార్డు శానిటేషన్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులుగా నియమింపబడి కాలువలు, చెత్తకుప్పల వెంట తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 423 జీఓ ప్రకారం మాకు అన్యాయం జరిగిందని, ప్రభుత్వం వెంటనే జీఓను రద్దు చేయాలని డి మాండ్ చేశారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయాల్లో అందరికీ జూనియర్ అసిస్టెంట్ పేస్కేలు వర్తింపజేయాలన్నారు.

25న బహిరంగ వేలం

చక్రాయపేట, జూన్ 22: గండి క్షేత్రంలో పూలు విక్రయించుకునేందుకు, టోల్‌గేట్ వసూలు చేసుకునేందుకు ఈనెల 25వ తేదీన మంగళవారం బహిరంగవేలం నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమీషనర్ అలవలపాటి ముకుందరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూలు విక్రయానికి రూ.5లక్షలు, టోల్‌గేట్ వసూలుకు రూ.5లక్షలు డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం దక్కించుకున్నవారికి ఏడాది పాటు హక్కు ఉంటుందన్నారు. 25వ తేదీన స్థానిక గండి కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలలోపు టెండరు బాక్సు నందు టెండర్లు వేయాలన్నారు. అనంతరం 10.30గంటలకు అందరి సమక్షంలో టెండర్లు తెరవడం జరుగుతుందన్నారు. మిగిలిన వివరాలకు కార్యాలయం పని వేళల్లో తెలుసుకోవాలని కోరారు.

'నిబంధనలు పాటించకుంటే రద్దు చేయాలి'

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 22 :జిల్లాలో నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ప్రైవేటు జూనియర్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని ఆర్ఎస్ఓ ఏఐఎస్‌యూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్ఐఓ కార్యాలయంలో ఆర్ఐవో వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌వో రాష్ట్రఅధ్యక్షులు జగన్, ఏఐఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జగదీశ్, నాగరాజులు మాట్లాడుతూ బద్వేలు నగరంలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసుకుని కొనసాగుతుందన్నారు. 8 స్క్వ్యయర్‌ఫీట్ ఉండాల్సిన భవనానికి 6500 స్క్వైర్‌ఫీట్‌మాత్రమే ఉన్న బిల్డింగు ఏర్పాటుచేసుకుని ఎటువంటి ప్రాక్టికల్ ల్యాబ్‌లు లేకుండా విద్యార్థులకు కనీస మౌళిక వసతులు లేకుండా తరగతులు సాగిస్తున్నారన్నారు. దీనిపై వచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

● కమిషనర్ రమణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

పులివెందుల రూరల్, జూన్ 22: పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లు, ఆసుపత్రుల పరిసరాలు, మరుగుదొడ్ల పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రమణారెడ్డి సూచించారు. శనివారం స్థానిక మున్సిపల్ వీడియో కాన్ఫిరెన్స్ హాల్‌లో సచివాలయ ఉద్యోగులకు స్టాప్ డయేరియా కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నీటి సరఫరాలో నీరు కలుషితం కాకుండా ప్రతి రోజు నీటిని సంబంధిత వార్డు అమెనిటి సెక్రటరీలు క్లోరిన్ టెస్ట్ చేయాలన్నారు. పట్టణంలో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, హోటల్లలో నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారం సరఫరా అయ్యేలా శానిటేషన్ సిబ్బంది తనిఖీలు చేయాలన్నారు. తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆహారం తీసుకునేముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, 5ఏళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సీడీపీఓ శ్రీలత, వైద్యాధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక లాభాలు: ఏడీఏ



మట్టినమూనా పరీక్ష విధానాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, జూన్ 22 : ప్రతి రైతు తన పొలంలో భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని విబరాపురం గ్రామంలో పర్యటించి భూసార పరీక్షలకు మట్టి నమూనా తీయు విధానాన్ని పరిశీలించారు. క్షేత్రస్థాయి సిబ్బందికి తగుసూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని కమలాపురం మండలంకు 520 నమూనాలు, వల్లూరు మండలం కు 460, ఎర్రగుంట్ల 530 నమూనాలు లక్ష్యంగా నిర్ణయించారు. నిర్ణయించిన లక్ష్యాల ప్రకారం ఆర్‌బీకే సిబ్బంది మట్టి నమూనాలు రైతుల నుంచి సేకరించి భూసార పరీక్ష కేంద్రంకు పంపాలని తెలిపారు. అలాగే ఆర్‌బీకే సిబ్బంది సమస్యాత్మక నేలలను గుర్తించి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి మట్టి నమూనాలను సేకరించవలసినదిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి దస్తగిరి, గ్రామ వ్యవసాయ సహాయకుడు వెంకటక్రిష్ణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేడు ప్రతిభాపురస్కారాల ప్రదానం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 22: వసంతపేటలోని బుశెట్టి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆదరణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతిలో పాఠశాల ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

డయేరియాపై జాగ్రత్తలు తీసుకోండి

జమ్మలమడుగు, జూన్ 22: జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో డయేరియా ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలపై సిబ్బందికి సమావేశం నిర్వహించారు. శనివారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ డయేరియాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ బాలమల్లేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సెక్రటరీలు పాల్గొన్నారు.

లలితాదేవి అమ్మవారికి విశేష పూజలు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 22: స్థానిక పాత మార్కెట్‌లోని రతనాల వేంకటేశ్వరస్వామి లలితాదేవి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం రతనాల వేంకటేశ్వరస్వామికి, లలితాదేవి అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం లలితాదేవి అమ్మవారికి సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు.

సమస్యల్లో సర్కారు బడులు

● సరిపడు వసతులు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు ● సగంలో నిలిచిపోయిన ఫేజ్ 2 పనులు ● మూతబడిపోతున్న పాఠశాలలు




అసంపూర్తిగా ఉన్న పిట్టిగుంట పాఠశాల భవనం, నర్సాపురంలో పశువులపాకగా మారిన అసంపూర్తిగాఉన్న ఉర్దూపాఠశాల భవనం

కాశినాయన,జూన్ 22:మండలంలో సర్కారు బడులు సమస్యల సుడిగుండంలో కొట్టిమిట్టాడుతున్నాయి.భవన నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. వస తులు ఉన్నచోట విద్యార్థులు లేరు విద్యార్థులున్నచోట వసతులు, సిబ్బంది లేరు అన్నట్లుగా ఉంది పరిస్థితి. మండల వ్యాప్తంగా మొత్తం 37 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో నాడు నేడు ఫేజ్ 1 కింద 17 పాఠశాలలు ఎంపిక చేశారు. ఇందులో ఒక్కోపాఠశాలకు రూ.15లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చుపెట్టి మరుగుదొడ్లు, కరెంట్,రంగులు, టేబుళ్లు,ఆర్వో ప్లాంట్, టీవీలు తదితర వసతులు కల్పించారు. ఇందులో భాగంగా నర్సాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (తెలుగు)కు దాదాపు రూ.20 లక్షలు ఖర్చుచేశారు. కానీ ప్రస్తుతం ఇక్కడ కేవలం 20 లోపు విద్యార్థులున్నారు. ఆపక్కనే ఉన్న ఉర్దూపాఠశాలకు కనీస వసతులు సిబ్బంది లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 100 సంవత్సరాల చరిత్రకల్గిన ఈపాఠశాల ప్రాథమిక నుంచి ప్రాథమికోన్నత స్థాయికి పెరిగింది. కానీ అందుకు తగ్గట్టుగా తరగతి గదులు, బోధనాసిబ్బందిలేక తిరిగి ప్రాథమిక స్థాయికి పడిపోయి నేడు మూతబడే స్థాయిలో ఉంది. రెగ్యులర్ ఉర్దూ ఉపాధ్యాయుడు లేక తాత్కాలికంగా సంబంధ ంలేని ఐఈఆర్టీ ఉపాధ్యాయుడిని పంపి పాఠశాలను తెరిపించారు.దీంతో కేవలం అక్కడ 5 తరగతులకు కలిపి 5గురు విద్యార్థులు ఉన్నటు సమాచారం. గతంలో ఉర్దూపాఠశాలకు బీఆర్‌జీఎఫ్ కింది అదనపు తరగతి గది నిర్మించారు.అది కూడా నిధులులేక అసంపూర్తి ఉంది. ఫేజ్ 2 కింది ఈ ఉర్దూపాఠశాలకు రూ.10 లక్షలు మంజూరు అయింది. కానీ ఆనిధులను అసంపూర్తిగాఉన్న కొత్తభవనానికి ఖర్చుచేసిఉంటే విద్యార్థులకు సౌకర్యవంతమైన బడి అందుబాటులోకి వచ్చేది. అధికారులు అలాకాకుండా పాతభవనానికే ఖర్చుచేశారు. ఇలా చేయడంతో రెండు భవనాలు అసంపూర్తిగానే ఉండిపోయాయి. ఇప్పటికే గంగనపల్లె, చెన్నవరం గ్రామాల్లో ఉర్దూపాఠశాలలు మూతబడ్డాయి నర్సాపురం ఉర్దూ పాఠశాల మూతబడితే ఉర్దూమీడియం చదవాలనుకున్న విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. ఇక ఫేజ్ 2 కింద నాడు నేడు పనులు నడుస్తున్న పిట్టిగుంట ప్రాథమికోన్నత పాఠశాల పరిస్థితి మరోరకంగా ఉంది. ఇక్కడ 100 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందుకు తగ్గట్టు వసతులు లేవు. అదనపు తరగతి గదుల నిర్మాణం రెండు సంవత్సరాలుగా నత్తనడకన సాగుతుంది. ప్రాథమిక స్థాయిలోఉన్న ఈపాఠశాలను ప్రాథమికోన్నత స్థాయికి పెంచారుగానీ, అందుకుతగ్గట్టుగా మౌలిక వసతులు,బోధనాసిబ్బందిని నియమించకపోవడంతో ఏమి చేయాలో తెలియక అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యా యులు తలలు పట్టుకుంటున్నారు. యూనిఫాం,పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, టీవీలు,శుద్ధిజలాలు అందించినంత మాత్రాన సర్కారుబడులు బలోపేతంకావని నాణ్యమైన విద్యను అందించే దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.మూతబడిన ఓబుళాపురం,పాపిరెడ్డిపల్లె, కొట్టాలపల్లె,అక్కంపేట లాంటి పాఠశాలలే కాకుండా ఈవిద్యాసంవత్సరం బసనపల్లె బడి కూడామూతబడిందని వచ్చే విద్యాసంవత్సరం మరెన్ని బడులు మూతబడుతాయోఅని మండల వాసులు ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ దశమ వార్షికోత్సవం

కొండాపురం, జూన్ 22: మండలంలోని కె. సుగుమంచిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ దశమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష్మీచెన్నకేశవ స్వామికి కల్యాణం నిర్వహిం చారు.అదేవిధంగా ప్రత్యేపూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

ప్రొద్దుటూరు , జూన్ 22 : ఎస్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల పరిష్కారవేదిక ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పవర్ హౌస్ రోడ్డులోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ఆవరణలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తారని ఈఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలనుంచి మద్యాహ్నం 1.30 గంటల వరకు ఈ అదాలత్ నిర్వహిస్తారన్నారు. విద్యుత్ వినియోగ దారులు వారి సమస్యలను అదాలత్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

కాశినాయన,జూన్ 22: నర్సాపురం తహసీల్దారు కార్యాలంలో ఈనెల 24వ తేదీ సోమవారం ఉదయం 9గంటల నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు కృష్ణ తెలిపారు. ఇక ప్రతి సోమవారం ఈకార్యక్రమం ఉంటుందని అన్ని శాఖల మండలస్థాయి అధికారులు ఈకార్యక్రమంలో పాల్గొని తమతమశాఖల అర్జీలను ప్రజలనుంచి స్వీకరించాలని కోరారు.

నేడు దేవాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు, జూన్ 22 : చేనేతలోని దేవాంగ విద్యార్థులకు పది, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు ఉట్టినాగశయనం తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక వినాయకనగర్‌లోని దేవాంగ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమం వుంటుందన్నారు. ఈ కార్యక్రమానికి హ్యాండ్లూమ్స్ ఆర్‌డీడీ గుత్తిరాజారావు. ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్, హైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్, సీనాయర్‌జర్నలిస్టు మానెం శ్రీనివాసులు, దేవాంగ సంఘం ప్రధాన కార్యదర్శి పుచ్చల రామక్రిష్ణ, సీనియర్ న్యాయవాది గొర్రెశ్రీనివాసులు, గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొంటున్నట్లు నాగశయనం తెలిపారు.

అంగన్వాడీ పిల్లలకు పలకలు పంపిణీ

బ్రహ్మంగారిమఠం, జూన్ 22 : బ్రహ్మంగారిమఠం మండలంలోని నరసన్నపల్లె గ్రామంలోని అంగన్వాడీ సెంటరులో ఉన్న పిల్లలకు పలకలు పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మండల టీడీపీ నేత వెల్లటూరు సాంబశివారెడ్డి ఆర్థిక సహకారంతో స్థానిక టీడీపీ నేత నాగిపోగు గంగయ్య, పీటర్‌లు విద్యార్థులకు పలకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

'జగన్ స్పీకర్ ఎన్నికను బహిష్కరించడం తగదు'

చాపాడు, జూన్ 22: శాసనసభలో ఎన్డీయే కూటమి తరుపున స్పీకర్ ఎన్నికను మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బహిష్కరించడం తగదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జగన్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారానికి గౌరవం ఇచ్చి సాంప్రదాయాన్ని కల్పించడం గొప్పతనమన్నారు. 2029లో మళ్లీ సీఎం అవుతానని జగన్ పగటి కలలు కంటున్నారన్నారు.

లైసెన్సులు లేకుండా పురుగుమందుల అమ్మకాలు

బ్రహ్మంగారిమఠం, జూన్ 22 : మండల కేంద్రంలో దాదాపు పది షాపుల వరకు క్రిమిసంహారక మందులు, ఎరువులు పురుగుమందు షాపులు ఉన్నాయి. అయితే ఇక్కడ వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా అధిక ధరలతో లైసెన్సులు లేకండా షాపులు నడుపుతున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో ఇష్టానుసారంగా అమ్మకాలు కొనసాగాయి. అప్పట్లో అధికారులను బెదిరించి దౌర్జన్యంగా షాపులను నడిపేవారు. లైసెన్సులు లేకపోయినా అమ్మకాలను సాగిస్తున్నారు. వీటిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధిక ధరలకు పురుగు మందులను కొనుగోలు చేసి నష్టపోతున్నామని పలువురు రైతన్నలు ఆరోపిస్తున్నారు. జిల్లా విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించాల్సిన పరిస్థితి ఎంతైనా ఉందని రైతన్నలు కోరుతున్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పోరుమామిళ్ల, జూన్ 22 :పోరుమామిళ్ల తహసీల్దరు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ప్రత్యేక అధికారి డాక్టర్ చంద్రశేఖర్, ఎంపీడీవో వరప్రసాద్‌రావు తెలిపారు. సోమవారం తమతో పాటు తహసీల్దారు శిరీషా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని ప్రజలు తమ సమస్యలు తెలియజేస్తే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

డయేరియా పై ముందస్తు చర్యలు తీసుకోవాలి



డయేరియాపై ముందస్తు చర్యలపై శానిటరీ సెక్రటరీలతో సమీక్షిస్తున్న కమిషనర్

ప్రొద్దుటూరు, జూన్ 22 : వర్షాకాలం ప్రారంభమైందని సీజనల్ వ్యాధులలో డయేరియా చాలా ప్రమాదకరమైనదని ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో సచివాలయాల శానిటరీ సెక్రటరీలు , డివిజన్‌ఇన్‌స్పెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు.వార్డులలో తిరిగిప్రతి ఇంటి పరిసరాలు శుభ్రంగా వుంచుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. డయేరియా గురించి దాని లక్షణాలు గురించి వార్డులలో సచివాలయాల శానిటరీ సెక్రటరీలు అవగాహన పెంపొందించాలన్నారు. ఎక్కడా పారిశుధ్యం లోపించకుండా చర్యలు తసుకోవాలన్నారు.

ఘనంగా చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 22: స్థానిక శివాలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం లోకకల్యాణార్థం వేద పండితులు గణపతి, నవగ్రహ, చండీ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు, వేదపాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరశర్మ, భక్తులు, పాల్గొన్నారు.

బాలా త్రిపురసుందరీదేవికి ప్రత్యేక పూజలు



జమ్మలమడుగు, జూన్ 22: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్నెతీర్థంలోని శ్రీ బాలత్రిపురసుందరీదేవికి జేష్టశుద్ధ పౌర్ణమిని పురష్కరించుకుని శనివారం భక్తులు తీపి పదార్థాలు సమర్పించారు. బాలత్రిపురసుందరీదేవికి 108 రకాల పిండి వంటలతో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఏళ్లనాటి కల... నేరవేరిన వేళ

● మురుగునీరు తొలగింపు

మైదుకూరు, జూన్ 22 : మరుగునీటి కాలువల మీదుగా తాగునీటి పైపు లైన్లు వెళ్తా నీరు కలుషితమవుతూ ఆనారోగ్యపాలవుతున్నారని, తాగునీటి పైపు లైన్లు మార్చాలంటూ ఎన్నో ఏళ్లుగా టీడీపీ కౌన్సిలరు పాశం వెంకట సుబ్బమ్మ, స్థానికులు అడుగుతూనే ఉన్నా, ఏళ్ళు గడుస్తూనే ఉన్నా ఏమాత్రం చర్యలు లేవు. ప్రస్తుతం ప్రజలు వైసీపీని తిరస్కరించి టీడీపీకి పట్టం కట్టడంతో శ్రీరాంనగస్‌వాసుల సమస్య పరిష్కారమైంది. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాలతో శనివారం ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు మధ్యలో గుంతలు తీసి తాగునీటి పైపులైను కొత్తవి వేసి ఇంటింటికి తాగునీటి కనెక్షన్ ఇచ్చారు. దీంతో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది.చాలా కాలంగా మరుగునీటిలో ఉన్న తాగునీటి కుళాయిలకు ప్రత్యేకంగా వేయించడంతో ఏళ్లనాటి సమస్య పరిష్కారం అయింది.



టీడీపీ నాయకులు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేకంగా కుళాయిలు

ప్రభుత్వం మారినా తీరు మారని అధికారులు

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర



పోరుమామిళ్ల, జూన్ 22 : గత వైసీపీ పాలనలో భూకబ్జాలు తారస్థాయికి చేరుకున్నాయని ప్రస్తుతం ప్రభుత్వం మారినా రెవెన్యూ అధికారుల తీరు మారలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. శనివారం పోరుమామిళ్లలోని ఎస్టీయూ కార్యాలయంలో నాలుగు మండలాల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇటీవల కాలంలో పెద్దఎత్తున భూములు కబ్జాకు గురవుతున్నప్పటికీ అధికారులు పట్టించు కోకపోవడం సిగ్గుచేటన్నారు. తహసీల్దార్లు తాము కేవలం ఎన్నికల విధుల కోసమే వచ్చాం, తమకు వారితో సంబంధంలేదని చేతులు దులుపుకోవడంతో అధికార పార్టీ భూకబ్జాదారులు రెచ్చిపోతున్నారన్నారు. చెరువులు, వాగులు వంకలు గ్రామకంఠాలు సైతం ఆక్రమించుకుని కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకోవడానికి సిద్ధపడుతున్నారన్నారు. పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీలో ఇటీవల ప్రభుత్వ భూములు కాజేయాలని ప్రయత్నిస్తున్నారని ఎక్స్‌కవేటర్లు పెట్టి కంచెలు వేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడలేదన్నారు. 11 సంవత్సరాల క్రితం ఏర్పడిన తిరుపతిరెడ్డికాలనీ వాసులకు పట్టాలు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు ఇబ్బదులు పడుతున్నారని ఆర్డీవో స్పందించి వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్, ప్రధాన కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే ఆది, భూపేశ్‌రెడ్డి



జమ్మలమడుగు, జూన్ 22: జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌ఛార్జి భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలినట్టు శనివారం వారు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి తదితర సమస్యలపై పనులకు సంబంధించి మాట్లాడినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రాకార మహోత్సవం



నారాపురం వెంకటేశ్వరస్వామి టేకు రథంపై ఊరేగింపు

జమ్మలమడుగు, జూన్ 22: జమ్మలమడుగులోని శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ, శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం స్వామివారిని టేకు రథంపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. గర్భగుడి చుట్టూ ప్రాకార మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నప్రసాద వితరణ జరిగినది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఇన్‌స్పెక్టర్ మోహన్, అర్చకుడు శ్రీనాథస్వామి, శ్రీవారి సేవా సమితి ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణుడు, కోశాధికారి గుర్రం శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, నందీశ్వరయ్య, సురేష్, శంకరయ్య, సుధాకర్, రామచౌడయ్య, భక్తులు పాల్గొన్నారు.

చిత్తుకాగితాలనుకుంటే మోసమే...

ఖాజీపేట, జూన్ 22: రోజు ఏదో ఒక చోట ఏదో ఒక పల్లెల్లో చిత్తుకాగితాలు కవర్లు అమ్ముకునేవాళ్లను చూస్తుంటాం. అయితే వారిలో కూడా దొంగతనాలకు పాల్పడుతూ మండలంలోని రావులపల్లెలో కాగితాలు, కవర్లు తీసుకెళుతూ పట్టుబడ్డారు. శనివారం ఉదయం గ్రామంలో కవర్లు, బాటిళ్లు సంచుల్లో వేసుకుంటూ ఎవరూ లేని గృహాల్లో బయటి ఉన్న స్టార్టర్లు, వైర్లు తీసుకుని ఆటోలో ఎక్కేందుకు సిద్ధంగా ఉన్నవారిని చూసి గ్రామస్థులకు అనుమానం వచ్చి సంచిని తీసి చూశారు. అందులో స్టార్టర్లు, వైర్లు ఉండడంతో గ్రామస్థులు ఆశ్చర్యపోయారు. అందరూ మహిళలు కావడంతో దేహశుద్ధి చేయలేక పోలీసులకు అప్పగించారు. ఆమేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

అట్లూరు, జూన్ 22: అట్లూరు క్రాస్‌రోడ్డులో శనివారం రాత్రి జరిగిన ఇరువర్గాల ఘర్షణలో ఒంటేరు నాగమునెయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో వర్గీయుడు బాలకృష్ణ ముఖంపై గాయాలవడంతో ఆయన ఫిర్యాదు మేరకు ఒంటేరు నాగమునెయ్య, శివసిద్ధయ్య, సురేశ్ మరో ఆరుగురిపై, నాగమునెయ్య ఫిర్యాదు మేరకు దేవర బాలకృష్ణ, కాకి రిషికేశవ, పోతిరెడ్డి రెడ్డయ్య మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారని ఎస్‌ఐ కేసీరాజు తెలిపారు. టీడీపీ నేత మండల ఇన్‌చార్జి పోతిరెడ్డి రెడ్డయ్య మండల నాయకుడు అని ఏ పనికైనా ఏ అవసరానికైనా ఆయన వద్దకే రావాలని రెడ్డయ్య వర్గీయుడు బాలకృష్ణ పేర్కొన్నారు. దీంతో నాగమునెయ్య అతని వద్దకు ఎందుకు రావాలనడంతో మాటా మాటా పెరిగి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుందని ఎస్‌ఐ తెలిపారు.